సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



ప్రేమ గొప్పదే.. కానీ..

ప్రేమ గొప్పదే. కానీ.. విద్యార్థి దశలో ఉన్నవారికి విద్యాభ్యాసం, కెరీర్‌పై శ్రద్ధ ప్రధానమని యువతరం అంటోంది.

- 8లో ▸



ప్రమాదకరంగా..

ఎల్లారెడ్డి పట్టణంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కంచెలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /15.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, రవాణా, ఆర్టీసీ, జీఎంఆర్ అధికారులతో డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ గురువారం సమావేశమయ్యారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న స్పాట్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. జాతీయ రహదారితోపాటు ప్రధాన రహదారుల్లో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇక ముందు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చేపట్టాల్సిన అన్ని చర్యలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో భిక్కనూర్, కామారెడ్డి రూరల్ సీఐలు సంపత్, రామన్, ఎస్సైలు ఆంజనేయులు, రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి



కామారెడ్డి క్రైం: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని ఏఆర్ డీఎస్పీ యాకూబ్‌రెడ్డి సూచించారు. కొత్తగా ఉద్యోగాలు సాధించిన ఏఆర్ కానిస్టేబుళ్లకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పోలీసు శాఖలో అనుభవజ్ఞులైన అధికారులతో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ మాట్లాడుతూ.. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ప్రజలతో ఎలా మెలగాలి, బందోబస్తు విధుల్లో ఎలా వ్యవహరించాలి అనే విషయాలపై పూర్తి స్థాయిలో పరిణతి సాధించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం పనికిరాదని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు సంతోష్‌కుమార్, నవీన్‌కుమార్, కృష్ణ, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపయ్య, నరేశ్, రామన్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి



బాన్సువాడ : పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి విద్యార్థులకు సూచించారు. 10వ తరగతి చదువుతున్న వసతి గృహాల విద్యార్థులకు డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ, బీసీ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో బాన్సువాడ రెడ్డి సంఘంలో విజయస్ఫూర్తి, ప్రేరణ అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో 10వ తరగతి కీలకమని, కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని అన్నారు. మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్ బంగారు మయమవుతుందన్నారు. వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్లు గంగాసుధ, విజయభారతి, విజయశాంతి, లక్ష్మణ్, శివరాం, పవన్, శారద, చంద్రకాంత్, శ్యాం, కృష్ణ, కాంతి, దశరథ్, సంధ్య, గంగావీణ, కృష్ణప్రసాద్, చక్రధర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు

గాంధారి(ఎల్లారెడ్డి): ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు ఇద్దరికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై కాలేజీ ప్రిన్సిపాల్ గడ్డం గంగారాంను వివరణ కోరగా, షోకాజ్ నోటీసులు వచ్చిన విషయం వాస్తవమేనని అన్నారు. విజయ్‌కుమార్ అనే అధ్యాపకుడు ఎగ్జామినేషన్ డ్యూటీలో ఉండగా, మరో అధ్యాపకురాలు సుజాతకు ఎన్నికల శిక్షణకు సంబంధించిన ఆర్డర్ అందలేదన్నారు. షోకాజ్ నోటీసులకు ఇద్దరు అధ్యాపకులు వివరణ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


ప్రేమను ప్రేమించు

Valentine's Day Special


- ఆకర్షణ కాదు..ఆలోచన ముఖ్యం
- కెరీర్ తరువాతే ప్రేమ
- సక్సెస్ సాధిస్తేనే సమాజంలో గౌరవం
- హద్దులు మీరి ఇబ్బందుల్లోకి వెళ్లొద్దు
- నేడు ప్రేమికుల దినోత్సవం

ప్రేమ అనేది అందమైన భావన. అంతకు మించి రెండు జీవితాలు, ఇద్దరి తరఫు కుటుంబాలను జీవితాంతం ప్రభావితం చేసేది. ఏది ప్రేమో, ఏది ఆకర్షణో తెలియని వయస్సులో కొందరు తప్పటడుగులు వేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఉన్నత చదువులు, కెరీర్‌పై దృష్టి సారించి సక్సెస్ సాధిస్తే సమాజంలో గౌరవం ఉంటుందని.. జీవితాంతం ప్రభావం చూపే ప్రేమను ప్రేమించాలని, ఆకర్షణ కాదు ఆలోచన ముఖ్యమని వ్యక్తిత్వ వికాస, మానసిక వైద్య నిపుణులు అంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



భ్రమల్లో తేలియాడొద్దు..



చాలా మంది యువతీయువకులు ఆకర్షణకు లోనై అదే ప్రేమ అనే భ్రమల్లో తేలియాడుతున్నారు. కెరీర్ మీద దృష్టి సారించకుండా అమ్మాయి తనను చూసి స్మైల్ ఇచ్చిందని, అబ్బాయి తన వైపే చూస్తున్నాడంటూ ఇద్దరూ ప్రేమ అనే వ్యామోహంలో పడిపోతున్నారు. స్మార్ట్ ఫోన్‌ల జమానాలో గంటలకొద్దీ ఫోన్‌లు మాట్లాడడం, అర్ధరాత్రి దాటేదాకా చాటింగ్ చేస్తూ తమ కెరీర్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదే సమయంలో హద్దులు మీరి ప్రవర్తిస్తూ ఇబ్బందుల్లోకి వెళ్తున్నారు.

పరిణతి లేని ప్రేమలు వికటిస్తాయి



ప్రేమ విఫలమైందని ఆత్మహత్యలకు పాల్పడడం, హత్యలకు తెగబడడం వంటి ఘటనలన్నీ పరిణతి లేని ప్రేమలకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఇద్దరి మధ్య ఉన్నది ప్రేమే అయితే ముందు జీవితాన్ని గెలవాలి. కెరీర్‌ను సెట్ చేసుకున్న తరువాత పెళ్లి ఆలోచనలు చేయాలి. కానీ కెరీర్‌ను పక్కన పెట్టేసి ప్రేమ పేరుతో తిరిగి తమ జీవితాలను బలితీసుకుంటున్నారు. ఇలాంటి పరిణతి లేని ప్రేమలు కన్నవారికి కడుపుకోతను మిగులుస్తున్నాయి. కెరీర్‌ను సెట్ చేసుకున్న తరువాత ప్రేమ, పెళ్లి గురించి ఆలోచనలు చేయడం ద్వారా జీవితాన్ని గెలవగలుగుతారు.

అర్థం చేసుకునేదే ప్రేమ



ప్రేమ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ప్రత్యేకమైన భాగం. అది ఒక నిర్ణయం మాత్రమే కాదు. బాధ్యత కూడా. నిజమైన ప్రేమ విశ్వాసం, గౌరవం, సహనం, అర్థం చేసుకునే స్వభావంపై ఆధారపడి ఉంటుంది. యువత తాత్కాలిక ఆకర్షణను ప్రేమ అనుకుని భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టివేయొద్దు. జీవితం నిరంతర యాత్ర. అందులో ఆకర్షణలు సహజమైనవి. కానీ వాటికి జీవిత నిర్ణయాల్లో ప్రాముఖ్యత ఇవ్వొద్దు. కెరీర్, ప్రేమ, ఆకర్షణల మధ్య సమతుల్యాన్ని కాపాడుకోవడమే నిజమైన విజయం. జీవితాన్ని అర్థవంతంగా మార్చుకోవడానికి యువత మనస్సులో స్పష్టత, ఆత్మవిశ్వాసం, శ్రమ అత్యవసరం.

– తిరునగిరి శ్రీహరి, వ్యక్తిత్వ వికాస నిపుణులు

కుటుంబ అనుబంధాలే ప్రధానం



తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నా తమ పిల్లలకు మంచి – చెడు చెప్పడంతోపాటు నిత్యం వారి కార్యకలాపాలను గమనించాలి. పిల్లలు చదువుకుంటున్నారని వదిలేయొద్దు. వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకుని ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటుండాలి. టీనేజ్‌లో చాలా మంది ఆకర్షణకు లోనవుతారు. అదే ప్రేమ అనుకుని కెరీర్‌ను పాడుచేసుకుంటారు. అలాంటి సమయంలో వారిని సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. వారికి ఎప్పటికప్పుడు లక్ష్యాన్ని గుర్తు చేస్తూ దానిపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలి.

– డాక్టర్ జి రమణ, మానసిక వైద్య నిపుణులు

సివిల్స్ సాధించి పెళ్లి చేసుకున్నాం

- నాది హర్యానా.. ఆమెది ఆంధ్రప్రదేశ్
- పరిచయం ప్రేమగా మారింది..
- రెండు కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



''ఆకర్షణ.. ప్రేమ కాదు. జీవితంలో స్థిరపడకుండానే తల్లిదండ్రులకు ఇష్టం లేని పెళ్లి చేసుకుని ఇబ్బందులు పడొద్దు. కెరీర్‌పై దృష్టి సారించాలి. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే రెండు కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ అవగాహన పెంచుకుంటూ ముందుకు వెళ్లాలి''.

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రేమలో పరిణతి ఉండాలని, రెండు మనసుల కలయికే ప్రేమ అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అంటున్నారు. వాలంటైన్స్ డే సందర్భంగా 'సాక్షి'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు. చాలా మంది యువత కెరియర్‌ను నిర్లక్ష్యం చేస్తూ, జీవితంలో స్థిరపడకుండానే తల్లిదండ్రులకు ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. జీవితంలో స్థిరపడి ఇరువైపుల వారిని ఒప్పించి పెళ్లి చేసుకుంటే రెండు కుటుంబాలూ సంతోషంగా ఉంటాయని సూచిస్తున్నారు. హర్యానాలోని భివానీకి చెందిన సంగ్వాన్ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన క్రాంతి(సంగారెడ్డి కలెక్టర్)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారి ప్రేమ, పెళ్లిపై ఆయన మాటల్లోనే..

వీకెండ్స్‌లో ఒక్క దగ్గరికి..

క్రాంతి సంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. మాకు ఒక పాప. తల్లి వద్దే పాప ఉంటోంది. వీకెండ్స్‌లో సంగారెడ్డికి వెళ్తా. సెలవు రోజుల్లో కచ్చితంగా కుటుంబంతోనే ఉంటా. అప్పుడప్పుడు టూర్లు వెళ్లాల్సిందే. మా ఇద్దరి మధ్య మంచి అవగాహన ఉండటంతో అటు కెరీర్‌లో, ఇటు కుటుంబ జీవితంలో సక్సెస్ అయ్యాం. ఒకరినొకరు అర్థం చేసుకుని అన్ని విషయాలపై చర్చించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఇద్దరి తరఫు కుటుంబాలూ కలుస్తుంటాయి.

నార్త్, సౌత్ పండుగలు చేసుకుంటాం

నేను పుట్టి పెరిగింది హర్యానాలో కాగా, తను ఆంధ్రప్రదేశ్‌లో. ఇక్కడి పండుగలు, సంప్రదాయాలు, అక్కడి పండగలు, సంప్రదాయాలు వేర్వేరుగా ఉంటాయి. మేము అన్ని పండుగలు చేసుకుంటాం. నార్త్, సౌత్ ఫెస్టివల్స్ చేసుకోవడంతోపాటు అన్ని రకాల ఫుడ్ తయారు చేసుకుంటాం. పండుగల సమయంలో ఇరువురి పేరెంట్స్ వచ్చి మాతో కలిసి ఉంటారు.

పెద్దల సమ్మతితో పెళ్లి చేసుకున్నాం

నేను, క్రాంతి ఢిల్లీ ఐఐటీలో చదువుకున్నాం. ఇద్దరం వేర్వేరు బ్యాచ్‌లకు చెందిన వాళ్లం కావడంతో అక్కడ మాకు పరిచయం లేదు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌లోకి వచ్చి లక్నోలో పని చేస్తున్న సమయంలో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. మాది హర్యానాలోని భివానీ. క్రాంతిది ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు. 2015లో ఇద్దరం సివిల్స్ రాసి ఒకే సమయంలో మంచి ర్యాంకులు సాధించాం. మా పరిచయం కెరీర్‌ను ఎక్కడా దెబ్బతీయలేదు. ఇద్దరం ఇష్టంగా కష్టపడి 2016 ఐఏఎస్‌కు ఎంపిక కాగా, వేర్వేరు రాష్ట్రాల్లో పనిచేయాల్సి వచ్చింది. ఇద్దరి తరఫు కుటుంబాలు పెళ్లికి ఒప్పుకున్నాయి. 2021 మేలో మా పెళ్లి కర్నూల్‌లో జరిగింది.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ప్రభారీ ఎస్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసి బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ప్రభారీ పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలను అస్త్రంగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు శ్రీకాంత్, భరత్, నరేందర్, వేణు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ

ఎన్నికల బరిలో 56 మంది పట్టభద్రులు.. 15 మంది ఉపాధ్యాయులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు వేసిన 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇందులో 12 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కాగా, ఒకరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది పోటీ పడుతున్నారు.

కుర్చీలేని డీఎల్పీవోలు !

- సొంత ఆఫీసు లేక ఇబ్బందులు
- ఏదో ఒక కార్యాలయంలో కూర్చోవాల్సిందే..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పంచాయతీ వ్యవహారాలను పర్యవేక్షించే డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో)లకు కార్యాలయాలు లేక ఎక్కడో ఒక చోట కుర్చీ వేసుకునే పరిస్థితి నెలకొంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 2019లో అన్ని డివిజన్‌లకు డివిజనల్ పంచాయతీ అధికారులను నియమించారు. అయితే వాళ్లకంటూ ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకపోవడంతో నాలుగైదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ కేంద్రంగా ఉన్న జిల్లా కేంద్రాల్లో అయితే డీఎల్‌పీవోలు కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో ఓ కుర్చీ వేసుకుని కూర్చుంటున్నారు. ఇతర డివిజన్‌లలో మండల పరిషత్ కార్యాలయాల్లో అక్కడి అధికారులు సహకరించి చోటు ఇస్తే కుర్చీ వేసుకుని తమ పని తాము చేసుకుని వెళ్తున్నారు. కొన్ని చోట్ల డీఎల్‌పీవోలకు కూర్చునేందుకు కూడా స్థలం దొరకడం లేదు. గతంలో డివిజన్‌లో పంచాయతీ కార్యాలయాలు ఉండేవి. ఆయా కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు, ముగ్గురు నాలుగో తరగతి సిబ్బంది ఉండేవారు. అప్పట్లో డీఎల్‌పీవో పోస్టుకు మంచి గౌరవం కూడా ఉండేది. అయితే జిల్లాల విభజన తరువాత డీఎల్‌పీవో కార్యాలయాలను ఎత్తేసి ఆ తరువాత పోస్టులు కూడా భర్తీ చేయలేదు. దీంతో పంచాయతీలపై అజమాయిషీ కరువైంది. జిల్లా పంచాయతీ అధికారి ఒక్కరే జిల్లా అంతా తిరగడం సాధ్యం కాలేదు. పర్యవేక్షణ కరువైంది. ఈ నేపథ్యంలో 2019లో తిరిగి అన్ని డివిజన్‌లలో డీఎల్‌పీవోలను నియమించినప్పటికీ వారికి కార్యాలయాలు మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో వారు ఎక్కడో ఒక చోట కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కీలకమైనది డీఎల్‌పీవో పోస్టు

ఒక్కో డివిజన్‌లో 150 నుంచి రెండు వందల గ్రామ పంచాయతీలు ఉంటాయి. గ్రామ పంచాయతీలకు సంబంధించి పాలక వర్గాలపై వచ్చే ఆరోపణలు, ఫిర్యాదులు, అలాగే పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై వచ్చే ఫిర్యాదులు వీటితో పాటు గ్రామాల్లో లే అవుట్‌లు, ఇళ్ల అనుమతులు, ప్రభుత్వ స్థలాల దుర్వినియోగం వంటి వాటికి సంబంధించి ఏ ఫిర్యాదు వచ్చినా డీఎల్‌పీవోలు వెళ్లి పరిశీలన జరిపి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. రెగ్యులర్‌గా పనులు ఉంటాయి. అంతేకాకుండా ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కూడా చేయాల్సి ఉంటుంది. అలాంటి డివిజనల్ పంచాయతీ అధికారులకు సొంత కార్యాలయాలు లేకపోవడం శోచనీయం. కార్యాలయంతో పాటు సిబ్బంది కూడా అవసరం ఉంటుందన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొత్త జిల్లాల్లో సూపరింటెండెంట్ పోస్టులూ లేవు

పాత జిల్లాల్లోని జిల్లా పంచాయతీ కార్యాలయాల్లో సూపరింటెండెంట్ పోస్టులు ఉన్నాయి. కొత్త జిల్లాల్లో మంజూరు ఇవ్వలేదు. జిల్లా పంచాయతీ అధికారికి రెగ్యులర్‌గా సమావేశాలు, టూర్లు ఉంటాయి. కార్యాలయంలో అన్ని వ్యవహారాలను చూసుకునేది సూపరింటెండెంట్. కొత్తగా నాలుగైదు ఎంపీటీసీ స్థానాలతో ఏర్పాటైన మండల పరిషత్ కార్యాలయాలకు సూపరింటెండెంట్ పోస్టులు మంజూరు చేసిన ప్రభుత్వం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలకు పోస్టులు కేటాయించలేదు. దీంతో ఆయా కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలుగుతోంది. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు పంచాయతీ వ్యవస్థలో ఉన్న ఇబ్బందులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గుడిలో బడి..



రాజంపేట మండలం గుడితండాలోని గుడిలో చదువుకుంటున్న విద్యార్థులు

విద్య, వైద్య రంగాల ప్రభావం సమాజంపై అంతాఇంతా కాదు. కీలక రంగాల స్థితికి ఈ రెండు ఘటనలు అద్దం పడుతున్నాయి.

రాజంపేట మండలం గుడితండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 30 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒకే ఒక్క టీచర్ పాఠాలు బోధిస్తున్నారు. రెండు గదులతో ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని ఒక గది కూలిపోయింది. మరో గదిలో కూర్చునే పరిస్థితి లేక సేవాలాల్ ఆలయంలో ఉపాధ్యాయుడు బడిని కొనసాగిస్తున్నాడు.

గాంధారి మండలం మాధవపల్లికి చెందిన చింతల అఖిల అనే గర్భిణికి బుధవారం రాత్రి 11గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. గైనిక్ వైద్యులు లేరని.. నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని ఇక్కడి వైద్యులు, సిబ్బంది సూచించారు. కుటుంబ సభ్యులు అఖిలను 108 అంబులెన్స్‌లో నిజామాబాద్‌కు తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ సిబ్బంది వాహనంలోనే డెలివరీ చేశారు. బిడ్డ మెడకు బొడ్డుతాడు చుట్టుకున్నప్పటికీ సిబ్బంది చాకచక్యంగా వైద్యం చేయడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం వారిని నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. - రాజంపేట/కామారెడ్డి టౌన్

వైద్యులు లేరండి..



అంబులెన్స్‌లో ప్రసవించిన గాంధారి మండలం మాధవపల్లికి చెందిన చింతల అఖిల

క్లుప్తంగా

గురుకుల క్రీడాకారుల సత్తా


పతకాలు సాధించిన క్రీడాకారులు

రామారెడ్డి: కామారెడ్డి జిల్లా రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ఈ నెల 11న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడాకారులు సత్తా చాటారు. జి.జీవన్, జె. శ్రీసాయి ట్రయథ్లాన్ విభాగంలో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. జి జీవన్ ఈ నెల 18, 19న ఉస్మానియాలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీటీ మహేశ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శివరాం, వైస్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సిబ్బంది అభినందించారు.

రామేశ్వర్‌పల్లిలో సినిమా షూటింగ్



భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో గురువారం ఐబీఎం ప్రొడెక్షన్ నెంబర్ వన్ బ్యానర్‌పై దర్శకుడు భానుశంకర్ నిర్మిస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సినిమా షూటింగ్ వల్ల గ్రామీణ కళాకారుల ప్రతిభను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్‌రెడ్డి, నేతలు శశికుమార్, వినోద్‌కుమార్‌గౌడ్, అనిల్, రాజేశం, యాదిరెడ్డి, సిద్దరాములు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఎల్లారెడ్డి రూరల్: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ కామారెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి తీసుకొస్తున్న యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మార్చి 2న హైదరాబాద్‌లో తలపెట్టిన యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

ప్రేమ గొప్పదే.. కానీ..!


మాట్లాడుతున్న సాందీపని కళాశాలల కరస్పాండెంట్ బాలాజీ రావు


పాల్గొన్న సాందీపని డిగ్రీ కళాశాల విద్యార్థులు

- ఆకర్షణతో జీవితాలు సర్వ నాశనం
- నిజమైన ప్రేమ మాత్రమే శాశ్వతం
- తల్లిదండ్రుల ప్రేమ, కెరీర్ కూడా ముఖ్యమే..
- 'ప్రేమ–ఆకర్షణ' అనే అంశంపై యువత మనోగతం



కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: ప్రేమ గొప్పదే, కానీ విద్యార్థి దశలో ఉన్నవారికి విద్యాభ్యాసం, కెరీర్‌పై శ్రద్ధ తీసుకోవడం కూడా అంతే ప్రధానమని యువతరం అంటోంది. నిజమైన ప్రేమ మాత్రమే శాశ్వతమని, ఆకర్షణ కారణంగా జీవితాలు సర్వ నాశనం కావడం పక్కా అంటున్నారు యువకులు. తల్లిదండ్రుల ప్రేమ, బంధాలు, బంధుత్వాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆకర్షణ బారిన పడి కెరీర్ పాడుచేసుకోవద్దనే అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రం లోని సాందీపని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'ప్రేమ–ఆకర్షణ' అనే అంశంపై విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

తల్లిదండ్రుల ప్రేమ గొప్పది


తల్లిదండ్రుల ప్రేమ గొప్పది. మనం పెళ్లి చేసుకుని పిల్లల్ని కన్నాక అప్పుడు తల్లిదండ్రులు గా మన ప్రేమ చాలా గొప్పదవుతుంది.కానీ ఇలా పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకోవడం సరికాదు. అంతగా ప్రేమించిన వాళ్లలో నిజాయతీ ప్రేమ ఉంటే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. – గణేశ్

ప్రేమ శాశ్వతం.. ఆకర్షణ తాత్కాలికం


ప్రేమ శాశ్వతంగా ఉంటుంది కానీ ఆకర్షణ తాత్కాలికంగానే ఉంటుంది. చనిపోయే వరకు పెద్దలు, పిల్లలు, బంధువులను ప్రేమించవచ్చు. కానీ ఆకర్షణ అనేది కొంత కాలం వరకే ఉంటుంది. జీవితంలో ఆకర్షణ ముఖ్యం కాదు. – శ్రేయ

నిజమైన ప్రేమను గుర్తించాలి


చిన్ననాటి నుంచి అల్లారు ముద్దుగా పెంచిన తల్లిదండ్రుల ప్రేమ గొప్పది. యువత ఆకర్షణకు లోనై జీవితాలను పక్కదారిపడుతోంది. నిజమైన ప్రేమను గుర్తించాలి. ప్రేమకు, ఆకర్షణకు మధ్య చాలా తేడా ఉంటుంది. – కీర్తన

నిజాయితీ ప్రేమకు ప్రాధాన్యత ఇవ్వాలి


ఎక్కువగా యువత కాలేజీ దశలోనే ఆకర్షణకు గురవుతున్నారు. నిజాయితీగా ప్రేమించుకుంటే పర్వాలేదు. టైంపాస్, ఎంజాయిమెంట్ కోసం కొందరు ప్రేమకు విలువ లేకుండా చేస్తున్నారు. ప్రేమ పేరుతో సమాజానికి చెడ్డ పేరు తీసుకు రావద్దు. – వైష్ణవి

ఆకర్షణతోనే ప్రేమ మొదలవుతుంది


ఆకర్షణతోనే మొదట ప్రేమ మొదలవుతుంది. ఆ ప్రేమ వివాహానికి దారి తీస్తుందా లేక విడిపోతామా అనేది ఇద్దరి మధ్య సఖ్యత, నమ్మకం, ఓపిక బట్టి ఉంటుంది. ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నా..లేక పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నా జీవితాంతం కలిసి బతికేలా ఉండాలి. – శ్రీలక్ష్మి

స్వార్థం లేని ప్రేమను ఎంచుకోండి


ఆకర్షణకు గురికావడమనేది సహజమే. తర్వాత ప్రేమలో పడ్డాక అది నిజమైనదా లేదా స్వార్థం కోసం ఆకర్షణకు గురై ప్రేమలో పడ్డామా అనేది గ్రహించాలి. ప్రస్తుతం సమాజంలో చాలా మంది ఆకర్షణ అస్త్రంతో ప్రేమను వాడుకుంటున్నారు. – నిఖిల్

పెద్దల అంగీకారంతో పెళ్లి..


చిన్ననాటి నుంచి మనం చనిపోయే వరకు తల్లిదండ్రులు నుంచి ఒకేలా ప్రేమను పొందుతాం. ప్రేమించి పెళ్లి చేసుకోవడం తప్పుకాదు కానీ పెద్దల అంగీకారంతో చేసుకోవడం చాలా మంచిది. నమ్మించి మోసం చేసేలా ఉండే ప్రేమను గమనించి వారికి దూరంగా ఉండాలి. – ముస్కాన్

సోషల్ మీడియా ప్రేమల జోలికి వెళ్లొద్దు


సమాజంలో ఎక్కువగా సోషల్ మీడియా చాటింగ్‌ల ప్రేమలు సాగుతున్నాయి. తల్లిదండ్రులకు దొరక్కుండా అతి తెలివితేటలతో ఇప్పుడు యూపీఐ యాప్‌లో కూడా చాటింగ్‌లు చేసుకుంటున్నారు. నీతినిజాయతీగా ప్రేమించుకుంటే ఎందుకంత భయం. – శ్రుతి

గొడవలతోనే ప్రేమకు దూరం


సమాజంలో ప్రతి ఒక్కరు చిన్న చిన్న విషయాలకే గొడవలు పడుతూ ప్రేమకు దూరమవుతున్నారు.మనం తప్పు చేస్తేనే తల్లిదండ్రులు కోపంతో మందలిస్తారు. అలాగే భార్యభర్తలు కూడా చిన్న చిన్న విషయాలకు గొడవలు పడుతుంటారు. వారి కోపంలోనూ ప్రేమను చూడాలి. – విఠల్

తల్లిదండ్రులను మోసం చేయొద్దు


ప్రేమ అనేది ఒక ఆటలాంటిది. మనం మంచిగా ఆడితేనే విజయం.. లేదంటే ఓటమి ఎదుర్కొంటాం. తల్లిదండ్రులకు తెలియకుండా దొంగచాటుగా భయపడుతూ ప్రేమించుకోవడం ఎందుకు. ఇద్దరు వ్యక్తుల మధ్య నిజమైన ప్రేమ ఉంటే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. పారిపోయి పెళ్లి చేసుకుని తల్లిదండ్రులను మోసం చేయవద్దు. – సిమ్రన్‌జీత్ కౌర్

చనిపోయే వరకు ప్రేమిస్తూనే ఉండాలి


ప్రస్తుతం సమాజంలో మేడి పండు చూడు మేలిమై ఉండును పొట్ట విప్పి చూడు పురుగులుండు అనే సామెతగా ప్రేమలు సాగుతున్నాయి. ఆకర్షణతో చిగురించే ప్రేమ వృథానే. నిజాయతీగా ప్రేమించుకుని పెళ్లి చేసుకుని ఆ ప్రేమను మనం చచ్చిపోయే వరకు పంచుకోవాలి. – ప్రీతి

ప్రేమ చాలా గొప్పది..


వివాహం చేసుకునే వరకు తల్లిదండ్రులు ఇచ్చిన ప్రేమ గొప్పది. ఆ తర్వాత జీవిత కాలం సంతోషంగా ఉండే భార్యభర్తల ప్రేమ ఇంకా గొప్పది. చెడ్డ ప్రేమంటూ ఉండదు. మనుషులే చెడ్డవాళ్లు. దయచేసి ఆకర్షణకు గురై తల్లిదండ్రుల ప్రేమను దూరం చేసుకోవద్దు. – జీవిత

కండీషనల్ ప్రేమల జోలికి వెళ్లకండి


అమ్మాయిలు అబ్బాయిలు గిఫ్టులు, జల్సాలు, కండీషన్స్ పెట్టుకుంటూ ప్రేమించుకుంటున్నారు. వాటి జోలికి వెళ్లకండి. ప్రేమిస్తే ఇంట్లో వాళ్లని ఒప్పించి అరేంజ్ మ్యారేజ్ చేసుకోండి. తల్లిదండ్రులు మన భవిష్యత్తు కోసమే తపన పడతారని గ్రహించాలి. ప్రేమలో ఓడిపోవద్దు. – హారిక

నమ్మకం లేని చోట ప్రేమ ఉండదు


మనలో మంచి ప్రవర్తన కనిపిస్తేనే సమాజంలో ఇతరుల నుంచి ప్రేమ దక్కుతుంది. మన క్యారెక్టర్ మంచిది కాదని గుర్తిస్తే ఎవ్వరూ మనసు ప్రేమించడానికి ముందుకు రారు. నమ్మకం లేని చోట ప్రేమ ఉండదు. మనం ఎంత అల్లరి చేసినా తల్లిదండ్రులు మనల్ని ప్రేమిస్తారు కానీ హద్దులు మీరితే వారు కూడా మనల్ని దూరం చేస్తారు. – ప్రత్యూష

జీవితంలో స్థిరపడ్డాకే..


విద్యార్థి దశలోనే ప్రేమించుకోవడం అవసరమా..? ముందు గా జీవితంలో స్థిరపడాలి. అప్పటి వరకు తల్లిదండ్రుల ప్రేమను దూరం చేసుకోవద్దు. ఉన్నత స్థాయిలో స్థిరపడ్డాకే అప్పుడు ప్రేమ, పెళ్లి గురించి ఆలోచించాలి. అప్పటి వరకు తల్లిదండ్రులనే ప్రేమించండి. – స్నేహ

మొదటి చూపుల్లోనే ప్రేమలో పడిపోకండి


మొదటి చూపుల్లోనే అమ్మాయి అబ్బాయి ప్రేమలో పడిపోయారంటారు కదా అలా చేయకండి. ప్రేమించుకుంటే ఒకరికొకరు అర్థం చేసుకున్నానే ప్రేమించుకోండి. ఇద్దరు అభిరుచుల్లో విభేదాలుంటే స్నేహితులుగా ఉండిపోండి. పెళ్లి చేసుకుని విడాకుల దాకా వెళ్లొద్దు. – నితీష

ప్రేమకు ఆకర్షణే మొదటి మెట్టు


ఆకర్షణ ఉంటేనే ప్రేమ మొదలవుతుంది. ఆకర్షణ లేకుంటే ప్రేమ పుట్టదు. కానీ ఆ ఆకర్షణలో మంచి చెడును గమనించాలి. ప్రేమించే వాళ్లు మంచి వాళ్లా లేక చెడ్డవాళ్లా.. వాళ్ల బ్యాక్ గ్రౌండ్ ఏంటి.? జీవితంలో కష్టపడతారా లేదా అనే గుణాలను గమనించాకే ముందుకు అడుగులు వేయాలి. మనస్సుకు పూర్తిగా నచ్చిన వాళ్లనే ప్రేమించండి. – మహమ్మద్ కరీముల్లా

అర్థం చేసుకోవాలి


నిజమైన ప్రేమ, మోసగించే ప్రేమ ఏదైనా మన ప్రవర్తన బట్టే ఉంటుంది. ఒకరికొకరు అర్థం చేసుకుంటేనే ప్రేమలు ఎల్లకాలం నిలుస్తాయి. చిన్న విషయాలకు గొడవలు పడితే అవి పెద్దగా మారి ప్రేమలు దూరమవుతాయి. ప్రేమించైనా..పెద్దలు కుదిర్చిన పెళ్లైనా ఇద్దరి మధ్య సఖ్యత లేకుంటే ప్రేమకు దూరమవుతారు. – మానస

లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డి రూరల్: లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని రామాలయం ఆవరణలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్‌ఈ గురువారం ప్రారంభించారు. పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో లో వోల్టేజీ సమస్య ఉండడంతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవి తీవ్రత ప్రారంభమైన నేపథ్యంలో ఎక్కడ కూడా లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో డీఈ విజయ సారథి, ఏఈ వెంకటస్వామి, లైన్‌మెన్ శశికాంత్‌రెడ్డి తదితరులున్నారు.

'అండగా ఉంటా.. అభివృద్ధికి కృషి చేస్తా'


బస్వన్నపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్

రాజంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. గురువారం బసవన్నపల్లి, ఆర్గొండ, కొండాపూర్, గుండారం, ఎల్లారెడ్డిపల్లితో పాటు పలు తండాలలో ఇటీవల ప్రమాదాల బారిన పడి మృతి చెందిన కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం ఆర్గొండలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎల్లారెడ్డిలో బస్సు డిపో ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్గొండ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులు నిధులు లేక ఆగిపోయాయని కాంట్రాక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పెండింగ్ బిల్లులు విడుదల అయ్యేందుకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నేతలు ఎర్ర ప్రణీత్ రెడ్డి, బీరయ్య, సల్మాన్, శ్రీధర్, హాజీనాయక్, బన్సీలాల్, సంతోష్ రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుంభమేళాకు వెళ్తూ.. అనంత లోకాలకు

- లారీని ఢీకొన్న కారు
- ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు
- బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో ఘటన


లారీ వెనుక భాగంలోకి చొచ్చుకుపోయిన కారు

బాల్కొండ: ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా వెళ్లేందుకు గురువారం హైదరాబాద్ నుంచి ఆరుగురు ప్రయాణికులతో బయలుదేరిన కారు ప్రమాదవశాత్తు లారీని ఢీకొట్టింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం చిట్టాపూర్ హైవే 44పై జరుగగా, ఒకరు మృతి చెందారు. ఐదుగురికి గాయాలయ్యాయి. బాల్కొండ ఇన్‌చార్జి ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన పోతు రమేష్, చంద్రశేఖర్ చారి, వనం శ్రీనివాస్, రజనీకాంత్, పోతు సాయివిశాల్, వనం సంపత్ రాణాలు కారులో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. బాల్కొండ మండలం చిట్టాపూర్ శివారుకు వరకు రాగానే ముందున్న లారీని ఓవర్ టేక్ చేసేందుకు కారును ఎడమవైపు తిప్పారు. అదేసమయంలో లారీ కూడా ఒక్కసారిగా ఎడమ వైపు తిరగడంతో కారు లారీ వెనుక భాగంలోకి చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన వనం సంపత్ రాణా (35) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆర్మూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీపై కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

● అనుమానాస్పదస్థితిలో ఒకరు..


తిమ్మయ్య(ఫైల్)

నిజాంసాగర్ (జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ ప్రధాన కాలువ ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఒడ్డె తిమ్మయ్య (48) రిజర్వాయర్ కాలువ వద్ద మృతిచెంది ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ తెలిపారు.

● ఫిట్స్ వచ్చి మరొకరు..


మృతుడు సాయిలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఓ వ్యక్తి ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పుల్కల్ గ్రామానికి చెందిన ఉట్నూర్ సాయిలు(43) గత కొన్ని సంవత్సరాల నుంచి ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం అతడు బిచ్కుందకు పని నిమిత్తం వచ్చాడు. ఫిట్స్ రావడంతో కిందపడిపోయి మృతి చెందాడు. మృతుడు పుల్కల్ గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. భార్య అనారోగ్యంతో గత ఐదేళ్ల క్రితం మరణించింది. ఒక కూతురు ఉందని గ్రామస్తులు తెలిపారు.

రేషన్ కార్డు కోసం ఆత్మహత్యాయత్నం

నిజాంసాగర్ (జుక్కల్): ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ వ్యక్తి నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా.. నిజాంసాగర్ మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన సందీప్‌గౌడ్ రేషన్ కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇంతవరకు రేషన్ కార్డు రాలేదని తహసీల్దార్ కార్యాలయానికి గురువారం పెట్రోల్ డబ్బా తీసుకొని వచ్చాడు. దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా రేషన్ కార్డు రావడం లేదని తన వొంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే రెవెన్యూ అధికారులు, పోలీసులు బాధితుడి సమస్యను తెలుసుకొని, రేషన్ కార్డు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

జంగంపల్లిలో ఒకరి ఆత్మహత్య


పుల్లూరి బాబు (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పుల్లూరి బాబు(35), తన తల్లి, భార్యతో కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇంటిలో నివాసం ఉంటున్నాడు. బాబు కామారెడ్డిలో ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటికి మరమ్మతుల కోసం అప్పులు చేయగా, అప్పు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేశారు. డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో గురువారం అతడు జీవితంపై విరక్తి చెంది తన గదిలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుచిత్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

బాన్సువాడ రూరల్: ఛత్రూనాయక్ తండాలో బుధవారం రాత్రి గుగ్లోత్ మాణిక్‌రావుకు చెందిన నివాసపు గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.90వేల నగదుతోపాటు రెండు తులాల బంగారం, విలువైన విస్తువులు కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. అలాగే పట్టాపాసుపుస్తకాలు, దుస్తులు, వంటపాత్రలు కాలిపోయాయి. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు.

నదిలో గల్లంతై.. శవమై తేలి..

రెంజల్(బోధన్): గోదావరి నదిలో పుణ్య స్నానాలకు వచ్చిన ఓ వ్యక్తి నీటిలో గల్లంతై, శవమై తేలాడు. వివరాలు..కోటగిరికి చెందిన సాయిబాబా(40) అనే వ్యక్తి మేనమామ మక్కయ్యతో కలిసి బుధవారం పౌర్ణమి సందర్భంగా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నదిలో స్నానానికి వచ్చారు. ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అదే రోజు స్థానిక జాలర్లలతో నదిలో గాలింపు చేపట్టగా, ఫలితం లభించలేదు. గురువారం ఉదయం తిరిగి గాలింపు చేపట్టి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో మార్కెట్ కమిటీ కార్యదర్శి మృతి


నర్సింలు(ఫైల్)

కామారెడ్డి రూరల్/భిక్కనూరు: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నర్సింలు (55) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మగోని లక్ష్మీ తెలిపారు. నర్సింలు కామారెడ్డి ఏఎంసీతోపాటు భిక్కనూరు ఏఎంసీలో ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. అతడి అకాల మరణం పట్ల ఆయా మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కామారెడ్డిలో అంత్యక్రియలు నిర్వహించగా ఏఎంసీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హాస్టల్ ఇష్టంలేక పారిపోయిన బాలుడు

- పట్టుకొని తల్లికి అప్పగించిన పోలీసులు


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేని ఓ బాలుడు పారిపోగా, పట్టణ పోలీసులు అతడి ఆచూకీ గుర్తించి, పట్టుకొని తల్లికి అప్పగించారు. వివరాలు ఇలా.. సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం గోరింటాల గ్రామానికి చెందిన బాలుడు కామారెడ్డిలోని ఫ్రాబెల్స్ పాఠశాలలో 7వ తరగతి చదువుకుంటూ హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం అతడు హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లగా, గురువారం అతడిని తల్లి పాఠశాలలో దింపేందుకు తీసుకుని వచ్చింది. కానీ హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని అతడు మారాం చేస్తూ పట్టణంలోని రైల్వే గేట్ వద్ద తల్లి చేయి వదిలించుకుని పారిపోయాడు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు అప్రమత్తమై గాలింపు చేపట్టారు. రెండు గంటల పాటు శ్రమించి బాలుడిని కొత్త బస్టాండ్ వద్ద గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తీసుకువచారు. అనంతరం బాలుడిని తల్లికి అప్పగించారు.